సూర్య

# తెలుగు భాష అభ్యున్నతికి కృషి చేయండి



వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్

హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఎంతో గొప్ప చరిత్ర ఉన్న తెలుగు భాష పరిరక్షణకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ ఎన్‌డి తివారీ కోరారు. అమెరికాలో నివసిస్తున్న తెలుగు వారికి ఎలాంటి ఆపద వచ్చినా తోటి తెలుగువారు ఆదుకోవాలని అన్నారు. మంగళవారం రాత్రి రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం వెబ్‌సైట్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం ప్రతినిధులు సునీల్ రావి, గోపి ఆచంటలు మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడిన తెలుగువారి కష్టాలు తీర్చేందుకు ఈ సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా తమ సంఘం తెలుగువారికి సేవలు అందిస్తుందని తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా తెలుగవారి కోసం సేవాభావంతో ఈ సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. అమెరికాలో నివసిస్తున్న తెలుగువారికి ఏ అవసరం వచ్చినా తమ సంస్థ సహాయం చేస్తుందని వారు స్పష్టం చేశారు. జులై 2నుంచి 4 వరకు ఫ్లోరిడాలోని ఆర్లాండాలో తమ సంస్థ మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి పదివేల మంది ప్రతినిధులు హాజరు కావచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నామని తెలిపారు.